ప్రజాశక్తి
బుధవారం 16 ఆగస్టు 2023
5
విజయనగరం





స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయనగరంలోని కొంకవీధిలో సామాజిక కార్యకర్త మక్కువ చక్ర కళాధర్ ఆధ్వర్యాన దీపాలతో లవ్ ఇండియా ఆకృతిని రూపొందించారు.


జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి



ప్రసంగిస్తున్న డిప్యూటీ సిఎం ముత్యాలునాయుడు

- ంంంంంంస్వాతంత్ర్య స్ఫూర్తితో మరింత ముందుకు
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం శాంతి పావురాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంపై గహ నిర్మాణశాఖ, జిల్లాలో పలు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ విమానాశ్రయం, జాతీయ రహదారులు, ఫ్లోటింగ్ జెట్టీ తదితర ప్రాజెక్టులకు చేసిన భూ సేకరణపై విజయనగరం ఆర్‌డిఒ విభాగం శకటాలను ఏర్పాటు చేశాయి. కొత్తగా ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఇంటింటికీ పోషకాహార సరుకులను తీసుకెళ్లే విధానం, తల్లీబిడ్డా ఆరోగ్యం కోసం తీసుకోవల్సిన చర్యలపై మహిళా శిశు సంక్షేమశాఖ, వన్యప్రాణుల ఆవాసాలను సంరక్షిద్దాం-జన సమూహాల్లోకి రాకుండా నివారిద్దాం నినాదంతో అటవీశాఖ, వ్యవసాయానికి ఉచితంగా అందిస్తున్న వైఎస్ఆర్ ఉచిత విద్యుత్ పథకం, టోల్ ఫ్రీ నెంబరు 1912పై విద్యుత్ శాఖ, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాన్ని భారీ ఎత్తు చేపట్టిన పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, అత్యవసర సమయంలో వినియోగించే 207 వజ్ర వాహనం, దిశ జాగతి యాత్రా వాహనాలతో జిల్లా పోలీసు శాఖలు శకటాల ప్రదర్శన నిర్వహించాయి. పెరేడ్ గ్రౌండ్‌లో ప్రదర్శన అనంతరం నగరంలోని మయూరి జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్ వరకు ఈ శకటాల ప్రదర్శనను నిర్వహించి పౌరులను ఆకట్టుకున్నాయి. శకట ప్రదర్శనను ప్రత్యేక ఉప కలెక్టర్ డి.వెంకటేశ్వర్రావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ చేసిన మాక్ డ్రిల్, అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై అవగాహన కల్పించింది.

ఈ సందర్భంగా పలువురు లబ్దిదారులకు మంత్రి ఇతర ప్రజాప్రతినిధుల చేతులమీదుగా ఉపకరణాలను పంపిణీ చేశారు. ఎపి మైక్రో ఇరిగేషన్ ఆధ్వర్యంలో 18 మంది రైతులకు సుమారు రూ.6.5లక్షలు విలువ చేసే బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.2.16లక్షలు విలువ చేసే లాప్‌టాప్‌లు, స్కైచెస్ జతలు, హియరింగ్ మిషన్లు, వీల్ ఛైర్‌ను పంపిణీ చేశారు. షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐదుగురు ఎస్‌సి రైతులకు ప్రకతి సేద్యం చేసేందుకు ఒక్కొక్కరికి సుమారు రూ.10వేలు విలువైన 5 విత్తన కిట్లు పంపిణీ చేశారు. బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో కాపునేస్తం పథకం కింద కాపు మహిళలకు ఒక్కొక్కరికీ రూ.15వేలు చొప్పున 5,934 మందికి ఆర్థిక ప్రోత్సాహకాన్ని, పరిశ్రమల శాఖ ద్వారా జగనన్న బడుగు వికాశం క్రింద ఆరుగురు లబ్దిదారులకు రూ.66.4 లక్షలు విలువైన స్వయం ఉపాధి యూనిట్లను అందజేశారు. మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా షాదీ తోఫా క్రింద ఒక మస్లిం జంటకు లక్ష రూపాయల ప్రోత్సాహ కాన్ని అందించారు.



సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు



జెండా వందనం చేస్తున్న ఇన్‌ఛార్జి మంత్రి ముత్యాలునాయుడు; కలెక్టర్, ఎస్‌పి,జెసి

ఉత్తమ అధికారులకు ప్రశంసాపత్రాలు

ఇటీవల కామన్‌వెల్త్ క్రీడల్లో బహుమతులు సాధించిన జిల్లా క్రీడాకారులు ఎస్.పల్లవి, బి.హారిక, సిహెచ్ శ్రీలక్ష్మి, ఎస్.గురునాయుడులను పతకాలతో అభినందించారు. పోలీసు శాఖలో విశిష్టమైన సేవలను అందించి, సేవా పురస్కారం, పతకాలను సాధించిన అధికారులకు పతకాలను అందించి అభినందించారు. డిప్యుటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్‌సిలు పాకలపాటి రఘువర్మ, డాక్టర్ సురేష్‌బాబు, గజపతినగరం ఎంఎల్‌ఎ బొత్స అప్పలనరసయ్య, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, డిసిసిబి ఛైర్మన్ వేచలపు వెంకట చినరామి నాయుడు, డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యుటీ మేయర్ లయా యాదవ్, పలువురు న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా స్వాతంత్ర్య వేడుకలు

- ఆకట్టుకోని సాంస్కృతిక కార్యక్రమాలు
- కలెక్టర్ ఆదేశాలకు భిన్నంగా ప్రశంసా పత్రాలు
- శకటాలు సరే..స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి ఏదీ?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా కేంద్రంలోని పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించిన 77వ స్వాతంత్ర్య వేడుకలు అత్యంత సాదాసీదాగా జరిగాయి. వివిధ శాఖల ఆధ్వర్యాన శకటాల ప్రదర్శన మినహా వాటిలో స్వతంత్ర్య సంగ్రామంలో జిల్లా పాత్రను, సమరయోధులను గుర్తుచేయలేక పోయారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జారీచేసిన ప్రశంసా పత్రాల జారీలో కలెక్టర్ ఆదేశాలు అమలు కాలేదు. దీంతో, కొంతమంది జిల్లా అధికారులు, పలు శాఖల సిబ్బంది తీవ్ర అసంతృప్తి, నిరాశ వ్యక్తం చేశారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది వేడుకలకు హాజరయ్యే జనాభా కూడా తగ్గింది. గతంలో స్వాతంత్ర్య దినోత్సవానికి 15రోజుల ముందు నుంచే ప్రభుత్వ శాఖలు, శాఖాధిపతుల్లో, పాఠశాలల్లో హడావుడి కనిపించేది. ముఖ్యంగా పాఠశాలల్లో రెండు వారాల ముందు నుంచే స్వాతంత్ర్య పోరాటం, అశువులు బాసిన మహనీయులను గుర్తు చేస్తూ వ్యాసరచన, కవితలు, చిత్రలేఖనం, పోరాట యోధుల వేషధారణ, నాటికలు, దేశభక్తిగేయాల పోటీలు నిర్వహించేవారు. వీటితోపాటే వివిధ రకాల ఆటల పోటీలు కూడా నిర్వహించేవారు. ఇలాంటి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని గుర్తించి, జిల్లా కేంద్రంలో నిర్వహించే స్వాతంత్ర్యవేడుకల్లో ప్రదర్శనలిచ్చేందుకు అవకాశం కల్పించేవారు. వీరి మధ్య కూడా జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి, అందులో దేశభక్తి, స్వాతంత్ర్యోమ స్ఫూర్తిని నింపే నాటికలు, ఆటపాటలను ఎంపిక చేసేవారు. ఇందుకు కలెక్టర్ ఆధ్వర్యాన ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసేవారు. ఈ ఏడాది అటువంటి కసరత్తు ఏమీ జరగలేదని సాక్షాత్తు అధికారులే చెబుతున్నారు. దీంతో, వేడుకల్లో నాలుగైదు ఆటపాటలతో ముగిశాయి. అవి కూడా ఆకట్టుకునే విధంగా లేకపోవడంతో వేడుకలు చప్పగా సాగాపోయాయంటూ కొందరు, మొక్కుబడిగా నిర్వహించారని మరికొందరు చర్చించుకున్నారు.

ఇక కలెక్టర్ పేరున జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జారీచేసే ప్రశంసా పత్రాల పంపిణీలోను పారదర్శకత లోపించిందనే విమర్శలు వినిపించాయి. అంతకంటే ముఖ్యంగా కలెక్టర్ తొలుత జారీచేసిన ఆదేశాలకు భిన్నంగా ఎక్కువ మందికి అందజేయడంతో ఎవరికి నచ్చినంతమందిని వారు సిఫార్సు చేసుకున్నారని, కలెక్టర్ తరపున పనిచేసేవారు కూడా సంఖ్యను పట్టించుకోలేదని మరికొందరి ప్రభుత్వ ఉద్యోగుల నోట వినిపించింది. ముఖ్యంగా గతంలో ప్రశంసలు అందుకున్నవారికి ఈసారి అవకాశం సిఫార్సులు చేయవద్దని, ప్రతి శాఖలోనూ ముగ్గురు కన్నా ఎక్కువ మందికి సిఫార్సులు చేయవద్దని సూచన చేశారు. కానీ ఈ ఏడాది జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా అందుకున్న జిల్లా అధికారులకు కూడా అందజేయడం గమనార్హం. ఇక సిబ్బంది విషయానికి వస్తే...సాక్షాత్తు కలెక్టర్ కార్యాలయానికి చెందిన 13మందికి ప్రశంసలు అందజేశారు. రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ తదితర శాఖలు కలెక్టర్ ఆదేశాలకు రెట్టింపు, నాలుగొంతుల స్థాయిలో సిఫార్సులు చేసి, ప్రశంసలు అందేవిధంగా చూసుకున్నారని మరికొన్ని శాఖలకు చెందిన సిబ్బంది చెవులు కొరుక్కున్నారు.

మంత్రి ప్రసంగం కూడా ప్రభుత్వంపై ప్రశంసల జల్లు, పథకాల ప్రగతి మినహా స్వాతంత్ర్య సంగ్రామంలో జిల్లా పాత్రనేమీ గుర్తు చేయలేదు. మొత్తం ప్రసంగంలో జిల్లాలో చేపట్టిన అభివద్ధి, సంక్షేమ పథకాలను వివరించడానికే ఎక్కువ సమయాన్ని వెచ్చించారు. వాస్తవానికి స్వాతంత్రోద్యమంలో విజయనగరం మహారాజ కళాశాల కేంద్రంగా క్విట్ ఇండియా, సైమన్ గోబ్, ఉప్పు సత్యాగ్రహం వంటి దీక్షలు సాగాయి, మాకొద్దీ తెల్లదొర తనం అంటూ గరిమెళ్ల తన పాటలతో ఉర్రూతలూగించారు. జిల్లా నుంచి పాల్గొన్న సమరయోధుల్లో సాలూరుకు చెందిన కూనిశెట్టి వెంకటనారాయణ దొర అగ్రగణ్యులు. సంపన్న కుటుంబంలో పుట్టిన దొర విలాసవంతమైన జీవితాన్ని విడిచి చిన్న వయసులోనే స్వాతంత్ర్యోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. గురజాడ, శ్రీశ్రీ వంటి ఉత్తరాంధ్రకు చెందిన కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, పత్రికా సంపాదకులు ఎంతోమంది భాగస్వామ్యమయ్యారు. స్వాతంత్ర్య వేడుకల్లో అమాత్యులుగానీ, అధికారులుగానీ ఇవేవీ గుర్తుచేయలేక పోయారు. కనీసం ఆ కుటుంబాలకు చెందిన వారినైనా వేడుకలకు ఆహ్వానించి ఉంటే బాగుండేది. చివరకు వేడుకల్లో వ్యాఖ్యానం కూడా పేవలవంగావుండడంతో సభికులు నివ్వెరబోయారు.

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం కృషి చేసిన మహనీయుల త్యాగాలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. దాదాపు 250 ఏళ్లపాటు దేశాన్ని పరిపాలించిన బ్రిటీష్ పాలకులను తరిమికొట్టడంలో, మన సమరయోధుల పోరాటం మనందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. వారు ఇచ్చిన స్ఫూర్తితో, దేశాభివద్ధికి ప్రతీఒక్కరూ కంకణబద్దులు కావాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలి : ఎస్‌పి

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పోలీసు సంక్షేమ ఆంగ్ల పాఠశాలలో ఆగస్టు 15న ఘనంగా జరిగాయి. ఎస్‌పి ఎం. దీపిక ముఖ్య అతిధిగా హాజరై, జాతీయ జెండాను ఎగుర వేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు బాటలు వేయాలన్నారు. విద్యార్థుల్లో జాతీయ భావం, సమైఖ్యత పెంపొందించాలని అన్నారు. విద్యార్థులు జాతీయ నాయకుల వేష ధారణ చేసి, ఆహుతులను ఆనందపర్చారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికేట్లును అందజేసారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, ఎఆర్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ట్రాఫిక్ డిఎస్‌పి డి. విశ్వనాధ్, ఎస్‌బి సిఐ కెకెవి విజయనాధ్, ప్రిన్సిపాల్ సంధ్య, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న మేయర్ విజయలక్ష్మి

జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో ఎస్‌పి పాల్గొన్నారు. సాయుధ బలగాల నుండి గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఎగుర వేసారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎంఎం సాల్మన్, డిఎస్‌పిలు ఎల్.శేషాద్రి, ఆర్. గోవిందరావు, ఆర్.శ్రీనివాసరావు, వీరకుమార్, డి.విశ్వనాధ్, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం వద్ద అదనపు ఎస్‌పిఅస్మా ఫర్హీన్ సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

నగరపాలకసంస్థ కార్యాలయంలో..

77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఘనంగా జరిగాయి. మేయర్ విజయలక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనాన్ని సమర్పించారు. ముందుగా మహాత్ముల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ రంగాలలో ఉత్తమ సేవలను అందించిన సచివాలయ సిబ్బందికి, కార్యాలయ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం స్వాతంత్ర దినోత్సవ సందేశాన్ని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ లయా యాదవ్, కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు, సహాయ కమిషనర్ ప్రసాద్ రావు, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వివి రాజేష్, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు

ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన జిల్లా అధికారులను, సిబ్బందిని అభినందిస్తూ మంత్రి ముత్యాలనాయుడు ప్రశంసా పత్రాలను అందజేశారు. అందులో కొందరు అధికారులు..



పోలీసుశాఖలో ప్రతిభావంతులకు సేవా పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పోలీసుశాఖలో ప్రతిభావంతంగా పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి బూడిముత్యాలు నాయుడు మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అందజేశారు. ఈ ఏడాది ఉగాదికి వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు, ఎఆర్‌ఎస్‌ఐ అనంత రామ పండా, ఆంధ్ర ఎఎస్‌ఐ బి.వి.రమణ, వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ బి.విశ్వనాధం, ఎఆర్ కానిస్టేబుల్ ఎం.కాశీ విశ్వనాధంకు ఉత్కృష్ట సేవా పతకాలను రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించింది. ఈ పతకాలకు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకలు సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడిముత్యాలు నాయుడు చేతుల మీదుగా ప్రదానం చేసారు. పోలీసుశాఖలో ప్రతిష్టాత్మకంగా భావించే పతకాలు పొందిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

మహాత్మా..మీరైనా మాగోడు వినండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తున్న తమకు వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించి, పర్మినెంట్ చేయాలని ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద గాంధీ విగ్రహానికి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ పేరుతో నేటికీ వేతన బానిసత్వం కొనసాగుతుందన్నారు. శాశ్వత స్వభావం కలిగి ఒకే విధమైన పని చేసే వాళ్ళందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా పాలకులు పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రజల మల ,మూత్రాలు, చెత్త ,చెదారం ఎత్తి పట్టణాలు పల్లెలను పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికులు, సమయంతో పని లేకుండా అత్యవసర నిత్యవసర సర్వీసులైన తాగునీరు, విద్యుత్ అందిస్తున్న ఇంజినీరింగ్, ఎలక్ట్రిసిటీ, ప్లాంటేషన్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మాట తప్పి ఆప్కాస్‌లో చేర్చడం ద్వారా శాశ్వత బానిసలను చేసిందని పేర్కొన్నారు. మధ్యవర్తులు లేని ఒక వ్యవస్థను ఏర్పాటు చేశామని గొప్పగా చెప్పుకుంటున్న ప్రభుత్వం రామ తీర్థాలు, ముషిడిపల్లి, నెల్లిమర్ల పంప్ హౌస్ కార్మికులకు టర్న్‌కీ సిస్టం రద్దు చేయకుండా కాంట్రాక్టర్లకు బందీలను చేసిందని అన్నారు. ఆప్కాస్ లో ఉన్న కార్మికులకు రూ.15వేలు జీతం అమల జరుగుతుంటే వీరికి మాత్రం రూ.9వేలు నుంచి రూ.12వేలు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. మహిళా కార్మికులపై పని భారం, వేధింపులు పెరుగుతున్నాయని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలైన మంచినీరు, మరుగుదొడ్లు లేవని తెలిపారు. ఆర్థిక, రాజకీయ అసమానతలు, కులతత్వం, మతతత్వ, ప్రాంతీయ విద్వేషాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాల ద్వారా మరో స్వాతంత్ర్య ఉద్యమానికి సన్నద్ధం కాబోతున్నామని పాలకులకు హెచ్చరించారు. కార్యక్రమంలో విఎంసి నగర కార్యదర్శి భాస్కర్ రావు, నాయకులు కుమారి, రామా , ఈశ్వరమ్మ, పైడిరాజు, శ్రీను, రాధా, నాగలక్ష్మి, కృష్ణమ్మ, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి మున్సిపల్ కార్మికుల వినతి



గాంధీ విగ్రహానికి వినతినిస్తున్న యూనియన్ నాయకులు

భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికి రూ.9లక్షలు పరిహారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రమాద వసాత్తూ మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికి సిఐటియు నాయకులు రూ.9లక్షలు పరిహారం ఇప్పించారు. పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం రాయవలసకు చెందిన గొండేల శంకర్ అనే భవన నిర్మాణ కార్మికుడు బతుకుతెరువు కోసం విశాఖపట్నం జిల్లా మారికవలస లో నివాసం ఉంటున్నాడు. ఆయనకు భార్య, ఒక పాప , బాబు ఉన్నారు. మంగళవారం పని కోసం పద్మనాభం మండలం మద్ది గ్రామంలో మూడో ఫ్లోర్ పై పరంజి మీద పనిచేస్తుండగా ప్రమాద వశాత్తూ జారిపడిపోయి మరణించారు. ఆయన భౌతిక కాయాన్ని,విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. కుటుంబ సభ్యులు సిఐటియు నాయకులకు సమాచారం ఇవ్వడంతో నగర కార్యదర్శి బి. రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, పెయింటింగ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు త్రినాధ్ ఆస్పత్రికి చేరుకున్నారు. స్థానిక సర్పంచ్, బిల్డింగ్ యాజమాని తో చర్చించి మరణించిన శంకర్ కుటుంబానికి 9 లక్షల రూపాయలు పరిహారం, దహన ఖర్చులు నిమిత్తం రూ.20వేలు ఇప్పించారు.

హక్కుల రక్షణలో న్యాయవ్యవస్థ పాత్ర కీలకం

జిల్లా ప్రధాన జడ్జి సాయి కల్యాణ చక్రవర్తి


ప్రజాశక్తి-విజయనగరం లీగల్

దేశ స్వాతంత్ర్య సాధనలో న్యాయవాదులు ముఖ్య పాత్ర పోషించారనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి అనాన్రు. ప్రస్తుత సమాజంలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణలో న్యాయవ్యవస్థ ముఖ్య భూమిక పోషిస్తుందని అన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగరవేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర సంగ్రామంలో ఎందరో మహానుభావులు త్యాగఫలమే మనము ఈనాడు స్వాతంత్ర్య ఫలాలు అనుభవిస్తున్నామన్నారు. ప్రజల రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు సిబ్బంది పాల్గొన్నారు. జి ల్లా వినియోగదారుల కమిషన్ ఆవరణలో జాతీయ పతాకాన్ని కమిషన్ చైర్మన్ ఆర్ వి నాగసంద్రం జాతీయ పతాకాన్ని ఎగరవేశారు కమిషన్ సభ్యులు అశోక్ శర్మ బి శ్రీదేవి సిబ్బంది పాల్గొన్నారు

ఉత్తమ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శంకర్రావు

స్థానిక జిల్లా కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా పనిచేస్తున్న మావూరి శంకర్రావు ఉత్తమ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా ఎంపికయ్యారు. కలెక్టర్ , ఎస్‌పి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


బొబ్బిలి: ఉత్తమ ఉద్యోగులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి


నెల్లిమర్ల: జెండాను ఎగురువేస్తున్న నగర పంచాయతీ ఛైర్‌పర్సన్


గజపతినగరం : జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే బొత్స


వేపాడ: జెండా వందనం చేస్తున్న ఎంపిపి సత్యవంతుడు


శృంగవరపుకోట: జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలతో పాటు పలు గ్రామాల్లో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన పలు క్రీడల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

ప్రజాశక్తి - జామి

మండలంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో జెడ్‌పిటిసి జి.సరయు జెండా ఆవిష్కరించి, విద్యార్థులకు స్వీట్లు, బహుమతులు అందజేశారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సతీష్ ఆధ్వర్యంలో ఎంపిపి సబ్బవరపు అరుణ జెండా ఆవిష్కరించారు. భీమసింగి గ్రామానికి చెందిన అమర వీరుల కుటుంబానికి సత్కరించి, వారి సేవలు కొనియాడారు. పలువురు సిబ్బంది సేవలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్.ఐ వీరబాబు తన సిబ్బందితో కలిసి జెండా ఆవిష్కరించారు. బిఎస్‌ఆర్ ఆశ్రమంలో నిర్వాహకులు భీశెట్టి శారద జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆశా, సాయి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ : తహశీల్దార్ కార్యాలయం వద్ద జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి, మండల కార్యాలయం వద్ద ఎంపిపి పీరుబండి హైమావతి, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ కె.కిరణ్ కుమార్ నాయుడు, కెజిబివి వద్ద ప్రిన్సిపాల్ జ్యోతి, ఎపి మోడల్ స్కూల్ వద్ద ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ జెండాలు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నీలకంఠరావు, ఎంపిడిఒ భానుప్రకాష్, ఎస్‌సిసెల్ జిల్లా అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, ఎంఇఒలు పాల్గొన్నారు.

గుర్ల: స్థానిక మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణలో ఎంపిపి పొట్నూరు ప్రమీల జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ హరిబాబు నాయుడు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి శీర అప్పల నాయుడు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, ఎంపిడిఒ కల్యాణి, తహశీల్దార్ పద్మావతి, డాక్టర్ షర్మిలి తదితరులు పాల్గొన్నారు.

బాలలకు అందుబాటులో న్యాయం

బాలలకు అందుబాటులో న్యాయం కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా నిర్వహించారు. యూత్ క్లబ్ బెజ్జిపురం, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మికుల నిర్మూలనపై విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలను నిర్వహించారు. విజేతలకు మాజీ ఎంపిటిసి కిలారి సూర్యనారాయణ బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఇంచార్జి ప్రిన్సిపల్ ఎస్. రామకృష్ణ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ పిఒ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక మండల పరిషత్తు, తహశీల్దారు కార్యాలయాలు, పోలీసు స్టేషన్, పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపిపి డి. సత్యవంతుడు జాతీయ జెండాను ఎగుర వేశారు. విజ్డం పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గురుకుల బాలికలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, తహశీల్దార్ ప్రసన్న కుమార్, ఎంపిడిఒ పట్నాయక్, ఎస్ఐ రాజేష్, ఎంఇఒ పి బాలభాస్కరరావు, ఎపిఒ ఆదిలక్ష్మి, పాఠశాలల ఉపాధ్యాయులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

బానాది యుపి పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి యశోద, గల్ల రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

బల్లంకిలో సర్పంచ్ వరలక్ష్మి, ఎంపిటిసి తులసి, స్కూల్ ఛైర్మన్ జగ్గారావు, వైస్ సర్పంచ్ ధనుంజయ ఆధ్వర్యంలో జెండా ఎగురువేశారు. వావిలపాడులో సర్పంచ్ బీల రాజేశ్వరి, స్కూల్ ఛైర్మన్ తణుకు మణి, శ్రీనాగిరెడ్డి, దేముడునాయుడు జెండా ఎగురు వేశారు.

డెంకాడ: భోగాపురం తహశీల్దార్, మండలపరిషత్తు కార్యాలయాలతో పాటు నాతవలస టోల్ గేటు వద్ద ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు జెండాను ఎగురువేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉప్పాడా అనూష రెడ్డి, నాయకులు పడాల భానుప్రకాశ్, వైస్ ఎంపిపి పడాల సత్యవతి, వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

డెంకాడ తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల్లో, అక్కివరంలోని ఎపి మోడల్ స్కూల్‌లో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ యు.మహేష్, ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం ఆదినారాయణ, మండల కేంద్రంలో సచివాలయం వద్ద పిఎసిఎస్ ఛైర్మన్ రొంగలి కనక సింహాచలం, సర్పంచ్ పతివాడ గౌరీ జెండాను ఎగరవేశారు. తహశీల్దార్ పి.ఆదిలక్ష్మి మండలంలో బాధ్యతలు చేపట్టి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించారు.

బొబ్బిలి: బొబ్బిలిలో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటారు. కార్యక్రమంలో బుడా ఛైర్మన్ ఇంటి పార్వతమ్మ, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయం, ప్రభుత్వాస్పత్రి వద్ద ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, కోటలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, పోలీస్ స్టేషన్లో డిఎస్‌పి పి.శ్రీధర్, మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ జాతీయ జెండాను ఎగురవేశారు. కాంగ్రెస్, జనసేన, బిజెపి కార్యాలయాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సూర్య రెసిడెన్సీ వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జాతీయ జెండాను లోకంపు విద్యా సంస్థల అధినేత తుమ్మల భాస్కరరావు ఎగురవేశారు. సిపిఐ ఆధ్వర్యంలో జెండమాల్ జంక్షన్‌లో జాతీయ జెండాను ఎగురవేశారు.


నెల్లిమర్ల: సెంచూరియన్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థిని

పట్టణంలో మాజీ సైనికులు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పాతబొబ్బిలి పెట్రోల్ బంకు వద్ద జాతీయ జెండాను మాజీ సైనిక ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.అప్పారావు జాతీయ జెండాను ఎగురవేశారు.

బొబ్బిలిరూరల్ : మండలంలోని తహశీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని జెండా ఎగురవేశారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ఆయన చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డోల రాజేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ గౌరి శంకర్, సాయికృష్ణ, డాక్టర్ రవికుమార్, డాక్టర్ శశిభూష ణరావు, ప్రభుత్వ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయం వద్ద యంపిపి సంబంగి లక్ష్మి జాతీయ జెండాను ఎగురు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పియంకే రెడ్డి, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయంలో, స్థానిక ఏరియా ఆసుపత్రి ఆవరణంలోనూ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడు బాబు, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


డెంకాడ: శాంతి పావురాలను ఎగరవేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

మండలంలోని గౌరీపురం, ఎస్ కోట మేజర్ పంచాయతీ, కేంబ్రిడ్జి - నారాయణ పాఠశాల, మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి కుమారి సబ్బవరపు వాణి, శాఖా గ్రంథాలయంలో సర్పంచ్ గనివాడ సంతోష్ కుమారి, పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్టిసి డిపో మేనేజర్ కే రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వరరావు, ఎల్ఐసి కార్యాలయ ఆవరణంలో బ్రాంచ్ మేనేజర్, గౌరీ విద్యానికేతన్ పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ కాండ్రేగుల సన్యాసినాయుడు, సుబ్బరామిరెడ్డి కళ్యాణ మండపం వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జి బంగారనాయుడు జాతీయ జెండాను ఎగరవేశారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చినబాబు బహుమతులను పంపిణీ చేశారు.

నెల్లిమర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, నగర పంచాయతి కార్యాలయంలో ఛైర్ పర్సన్ బంగారు సరోజినీ, కొండవెలగాడ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఆర్టీసి జోనల్ ఛైర్‌పర్సన్ గదల బంగారమ్మ, సతివాడలో సర్పంచ్ రేవళ్ళ శ్రీని వాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్య నారాయణ జెండా ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకట రమణ, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం నాయుడు, పతివాడ సత్య నారాయణ, సీనియర్ నాయకులు మత్స సత్య నారాయణ, మొయిద పిఎసిఎస్ అధ్యక్షులు అట్టాడ కనకా రావు, ఎంపిడిఒ జి. గిరిబాల, ఇఒపిఆర్‌డి హెచ్. భానోజీ రావు, నగర పంచాయతిలో వైస్ ఛైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, కో ఆప్షన్ సభ్యులు చిక్కాల సాంబశివరావు, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో..

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విసి పికె మహాంతి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఆ తరువాత విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. అనంతరం ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్-1, 2, 3, 4 యూనిట్ల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్వీ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, డీన్లు ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, ప్రొఫెసర్ సన్నీడియోల్, ప్రొఫెసర్ మురళీ, ప్రొఫెసర్ పుష్పలత, హెచ్ఆర్ మేనేజర్ శ్రీనివాస్, డాక్టర్ సతీష్, డాక్టర్ విజయ్ కుమార్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయం, వివేక మాస్టర్ మైండ్ పాఠశాల వద్ద ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ జెండా ఎగురవేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద డిటి సుందర రావు, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ ఆర్ జనార్దన్ రావు జెండా ఎగరవేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంపిపి సురేష్ ముఖర్జీ, మాజీ జెడ్‌పిటిసి బొత్స వాసుదేవరావు నాయుడు, వైసిపి మండల కన్వీనర్ కరణం సుదర్శన రావు చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. వివేక్ మాస్టర్ మైండ్ పాఠశాలలో విద్యార్థులు చేసిన విన్యాసాలు పలువురు ఆకట్టుకున్నాయి.

గజపతినగరం: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విఆర్‌ఒలకు ప్రశంసా పత్రాలను అందించారు. ఎమ్మెల్యే అప్పల నరసయ్యను రెవెన్యూ శాఖ సాలువ కప్పి, బొబ్బిలి వీణను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, ఎంపిటిసి కర్రి కళావతి, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాధ రావు, తహశీల్దార్ ఎం.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

జనసేన నియోజకవర్గం నాయకులు మర్రాపు సురేష్ ఆ పార్టీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు ఆధాడ మోహన్ రావు, డాక్టర్ రవి కుమార్, పండు, ఆదినారాయణ, మహేష్, రాజీవ్ పాల్గొన్నారు.

విజయనగరం: స్థానిక శ్రీ చైతన్య పాఠశాల రింగ్ రోడ్డు బ్రాంచ్‌లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలలో పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షకులు వి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పతాకావిష్కరణ చేశారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌బాబు, డీన్లు సత్యనారాయణ, సూర్యచంద్ర, సిబిఐ అప్పలనాయుడు, ఐపియల్ ఇంచార్జి సాయి కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తవలస: స్థానిక ఎంపిడిఒ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, వియ్యంపేట బ్రిడ్జి స్కూల్, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ జెండా ఎగరవేశారు. మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో, కళాశాలలో స్వాతంత్ర వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో పిఎసిఎస్ అధ్యక్షులు గోరపల్లి శివ, ఎంపిడిఒ పద్మజ, ఎంఇఒలు జి శ్రీదేవి, బండారు శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని ఎరుకల పాకాల గ్రామంలో ఎంపిటిసి పాలవలస గౌరు, సర్పంచ్ పార్వతి జాతీయ జెండా ఎగర వేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం డి. సత్యనారాయణ, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ జయంతి, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ అజ్‌హఫీజాన్, స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బోగి గౌరి, ఎంపిడిఒ ఆంజినేయులు, గ్రంథాలయంలో అధికారి దుర్గాప్రసాద్, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, ఎంపిటిసి దేవరపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ కండి రమేష్, చప్ప శివున్నాయుడు, కేజిఎస్ శర్మ, వై.స్వామినాయుడు పాల్గొని జెండా ఎగరవేశారు. మండలంలోని ముగడ గ్రామంలో పదోతరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థికి ముగడతల్లి అభివృద్ధి సంఘం సత్కరించి మెమొంటోను అందించింది.

పూసపాటిరేగ: స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిపి మహంతి కళ్యాణి, తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఇమంది బాస్కరరావు, ఉన్నత పాఠశాలలో జెడ్‌పిటిసి మహంతి సీతాలక్ష్మి, సచివాలయం వద్ద సర్పంచ్ టొంపల సీతారాం, పిఎసిఎస్ వద్ద పిఎసిఎస్ ఛైర్మన్ మహంతి లక్ష్మణరావు, మండలంలోని సచివాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా ఎగరవేసారు.

విజయనగరం టౌన్ : ఎందరో మహనీయుల పోరాట ఫలితమే నేటి మన స్వేచ్ఛా జీవితమని శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మంగళవారం విజయనగరంలోని తన నివాసం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. జాతిపిత గాంధీ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫోర్టుసిటీ పాఠశాలలో..

ఫోర్ట్ సిటీ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ప్రీప్రైమరీ విద్యార్థులు వివిధ రాష్ట్రాల సంస్కృతీ సంప్రదాయాలను తెలియచేసే విధంగా వేషధారణతో కూడిన నృత్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ కె.ఎ.పి.రాజు (శివ), వైస్ ఛైర్మన్ చంటి, ప్రిన్సిపల్ రోయినా ఖాన్, డైరెక్టర్లు మధు, అశీక్, నీలిమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయంలో

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో ఉపకులపతి ప్రొఫెసర్ టి.వి. కట్టిమణి, డీన్స్ ఆఫ్ స్కూల్స్ ప్రొఫెసర్ శరత్ చంద్ర బాబు, ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రాతో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు.

రోటరీ సేవా నిరతి అభినందనీయం : కోలగట్ల

అన్ని వర్గాలకూ అండగా నిలుస్తూ వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్న రోటరీ క్లబ్ భవిష్యత్తులో మరింత మందికి చేయూతనందించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రదీప్ నగర్ వద్ద విజయనగరం రోటరీ క్లబ్, రోటరీ పార్వతి దేవి అంచాలియా వాలంటరీ బ్లడ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన కోలగట్ల మాట్లాడుతూ రక్తదాన ఆవశ్యకతను గుర్తించి శిబిరాలు ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

త్యాగాల ఫలితం స్వాతంత్ర్యం



మాట్లాడుతున్న ఎం. శ్రీనివాస

విజయనగరం టౌన్ : ఎంతోమంది అమర వీరులు, ప్రజల త్యాగాల ఫలితంగా మన దేశానికి స్వాతంత్రం వచ్చిందని ఎల్ఐసి ఉద్యోగుల సంఘ నాయకులు ఎం. శ్రీనివాస అన్నారు. స్వతంత్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక గురజాడ గ్రంధాలయంలో విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కె. శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో శ్రీనివాస మాట్లాడుతూ ఈ 76 సంవత్సరాలలో దేశం అభివృద్ధి చెందినప్పటికీ, ఇంకా స్వాతంత్ర ఫలాలు ప్రజలందరికీ సమానంగా అందలేదన్నారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఫలితాలు అందరికీ అందాలంటే ఆర్థిక, సామాజిక అసమానతలు పోవాలన్నారు. ఇందిర మాట్లాడుతూ దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని గురజాడ అన్నారని గుర్తు చేశారు. దేశ ప్రజలందరి ఆర్థిక, సామాజిక స్థితుల్లో మార్పు రావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

గుల్లపాడులో పడగ విప్పిన మలేరియా

● ఒకే కుటుంబంలో ముగ్గురికి జ్వరం

● ఒకరు మృతి

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని గుల్లపాడు గ్రామస్తులు మలేరియా జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా గ్రామంలో జ్వరాలు ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతున్నాయి. జ్వర పీడితులలో ఒకే కుటుంబానికి చెందిన గుండాల ఈశ్వరమ్మ (50) మృతి చెందగా ఈమె భర్త నాగరాజు విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కుమారుడు శేఖర్ రాజాం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో మరో ఇద్దరు మలేరియా జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. గ్రామస్తులు రేగిడి వైద్యాధికారి అసిరి నాయుడుకు సమాచారం ఇవ్వగా గ్రామాల్లో ఇంటింటికి జ్వర పీడితులను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నారు. వైద్య శిబిరం నిర్వహించి మందులు అందజేస్తున్నారు. సర్పంచ్ లావణ్య చక్రపాణి, పంచాయతీ కార్యదర్శి పారిశుధ్య కార్యక్రమాలు, ఫాగింగ్ యంత్రాలతో పొగ వంటివి చేపడుతున్నారు. సెరిబ్రియల్ మలేరియా జ్వరాలుగా అనుమానం ఉండడంతో విశాఖ ల్యాబ్‌కు రక్త నమూనాలను పంపించారు. ఎక్కువ వైద్య శిబిరాలను నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ఈశ్వరమ్మ(ఫైల్)

అసహనం ఎందుకు?

డెంకాడ: స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు అసహనంతో మాట్లాడుతున్నాడని మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏదో న్యూస్ ఛానల్లో ఆయన పార్టీ మారుతున్నట్లు కథనం వస్తే దానికి టిడిపిని తమ పార్టీ నాయకులను విమర్శించడం సరికాదన్నారు. ఆయన తీరును చూస్తే మతిస్థిమితం లేని వ్యక్తిగా మాట్లాడుతున్నాడనిపిస్తోందన్నారు. వైసిపిలో గ్రూప్‌లు ఎక్కువ ఉండడంతో తనకా పార్టీలో టికెట్ వస్తుందో రాదో తెలియని స్థితిలో ఉన్నారని అందుకే ఇలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా హుందాతనంగా మాట్లాడటం నేర్చుకోవాలని హితవు పలికారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

'విజ్ఞానజ్యోతి జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక పట్టణంలోని ఆర్కె ఫంక్షన్ హాల్ కన్నుల పండుగగా జరిగింది. 2000-2002 బ్యాచ్‌లో విజ్ఞాన జ్యోతి కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకున్న విద్యార్థులందరూ కలుసుకుని 21 సంవత్సరాల తరువాత వారికి విద్య నేర్పిన ఉపాధ్యాయులకు గౌరవ స్వాగత, సత్కారా లతో తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన ఉపాధ్యాయులు సైతం ఈ సమావేశానికి హాజరై తమ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ విద్యార్థులను మరోసారి ఆశీర్వదించారు. విజ్ఞాన జ్యోతి జూనియర్ కళాశాల ప్రారంభమై 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా త్వరలోనే ఆ వేడుకను కూడా చేసుకోబోతు న్నట్లుగా సంస్థ అధినేత కోటరావు సభా ముఖంగా ప్రకటించారు.

ఆశయాలను కొనసాగిస్తా

బాడంగి: తన తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే తెంటు జయప్రకాష్ ఆశయాలను కొనసాగిస్తానని మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు అన్నారు. మంగళవారం తెంటు జయప్రకాష్ 75వ జయంతి వేడుకలను బాడంగిలో ఘనంగా జరుపుకున్నారు. ముందుగా తెంటు జయప్రకాష్ సమాధిపై పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. లక్ష్మునాయుడు మాట్లాడుతూ ప్రజా జీవి తంలో ఆరుసార్లు పోటీ చేసి ఐదుసార్లు విజయం సాధించి ప్రజల గుండెల్లో స్థిర స్థాయిగా తన తండ్రి నిలిచిపోయారన్నారు. కార్యకర్తలు సంక్షేమం కోసమే తను పని చేస్తానని అన్నారు.

రోడ్డుకో దండం.. జగన్ కో దండం

కొత్తవలస: మండలంలోని వీరభద్రాపురం నుండి కర్రిచిన్నయ్యపాలెం గ్రామానికి వెళ్లే తారురోడ్డు మార్గాన్ని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి టిడిపి నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. రోడ్డు పరిస్థితి చాలా అధ్వానంగా ఉండడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి కావొస్తున్నా, ఈ పరిపాలన చేతకాని అసమర్థత సైకో జగన్ రెడ్డి, స్థానిక వైసిపి ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించారని ఘాటుగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొబ్బిలి అప్పారావు మాస్టర్, కోళ్ల వెంకటరమణ (శ్రీను), బంగారు రమేష్, తిక్కాన చినదేముడు, ఎల్లపు సూరిబాబు, కనకాల శివ, లాలం అర్జునరావు, పొట్నూరు వెంకట రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువత

స్వచ్ఛంద రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని ఎస్ఆర్ పేట శ్రీలక్ష్మీ బాలాజీ నర్సింగ్ హోమ్ నాలుగో వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ ఆల్తి రమణ మాట్లాడుతూ క్వాలిఫైడ్ వైద్యులతో నూతన వైద్య పరికరాలతో సాధారణ గ్రామీణ ప్రాంత ప్రజలకు మంచి వైద్య అందించాలని ఉద్దేశంతో ఆసుపత్రి నిర్మించామన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాలలో చాలా మంది ప్రజలకు వైద్య సేవలు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి, మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఐ గోపాలరావు, ఉమాశంకర్, కోట్ల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో కాలువ పనులు

రేగిడి : మండలంలోని ఆర్ఆమదాల వలస, నాయరాలవలస, రాజయ్యపేట, గోపెంపేట గ్రామా ల సమీపంలో ప్రవహిస్తున్న మడ్డువలస ఎల్ 17 కాలువ పనులు రైతులు శ్రమదానంతో మంగళ వారం చేపట్టారు. ఈ కాలువ పనులను అధికారులు పట్టించుకోకపోవడంతోనే సాగునీరు వ్యవసాయానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఈ కాలువ ఎన్నో ఏళ్ల నుంచి మరమ్మత్తులు చేపట్టకపోవడంతో పిచ్చి మొక్కలు, గుర్రపు డెక్కన్ ఉండడంతో వచ్చిన కొద్దిపాటి నీరు కూడా పొలం వరకూ రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్ ఆముదాలవలస రైతులు 75 మంది శ్రమదానంతో కాలువ పనులు చేశారు. అధికారులు స్పందించి కాలువ మరమ్మతు పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


పనులు చేస్తున్న రైతులు


మనస్థాపంతో టైలర్ మృతి

మెరక ముడిదాం: మండల కేంద్రానికి చెందిన టైలర్ కొండేటి పాపారావు(43) మనస్థాపంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. పాపారావుకి అతని భార్యకు మధ్య సుమారు మూడు నెలలు క్రితం మనస్పర్ధలు జరిగి విడాకులు తీసుకున్నారు. అనంతరం పాపారావు మద్యానికి బానిసై సోమవారం రాత్రి ఉరి వేసుకొని చనిపోయినట్లు మృతుని తల్లి సత్యవతి బుధరాయవలస పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ పడాల్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

మాంసం విక్రయాలపై దాడి

బొబ్బిలి: మున్సిపాలిటీలో మాంసం విక్రయాలపై మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాంసం విక్రయాలపై నిషేధం ఉన్నప్పటికి పార్వతీపురానికి చెందిన భోగి లక్ష్మణరావు ఆటోలో మాంసం తీసుకువచ్చి సంగవీధిలో అమ్ముతుండగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, మున్సిపల్ సిబ్బంది పట్టుకుని రూ.3వేలు జరిమానా విధించారు. రామా టాకీస్ సెంటర్లో కొక్కోరోకో రెస్టారెంట్‌లో చికెన్ బిర్యానీఅమ్మడంతో దాడులు చేసి రూ.2వేలు జరిమానా విధించారు.


పీడీ చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న ఎపిఒ హరినాథ్


విజయవాడలో డైరెక్టర్ లక్ష్మీశా నుంచి అవార్డు అందుకుంటున్న అయ్యప్ప


జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు చేతులు మీదుగా అవార్డులు అందుకుంటున్న బొబ్బిలి తహశీల్దార్ రాజ్యేశ్వరరావు, డెంకాడ వ్యవసాయ విస్తరణాధికారి రామకోటి, కొత్తవలస డిటి అప్పారావు, రామభద్రపురం ఎస్ఐ సురేంద్రనాయుడు(కుడి నుంచి ఎడమకు)